వెంకటకృష్ణారెడ్డి మరణం బాధాకరం

● ఎమ్మెల్యే కరణం



వెంకటకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల టౌన్: సీనియర్ రాజకీయ నేత, పాదిలి మాజీ ఏఎంసీ చైర్మన్, మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, చీరాల ఆర్డీవో పి.సరోజిని రెడ్డి తండ్రి పాతకోట వెంకటకృష్ణారెడ్డి మరణం బాధాకరమని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన చీరాల ఆర్డీవో తండ్రి మరణించగా శనివారం పాదిలి వెళ్లి సీనియర్ రాజకీయ నేత వెంకటకృష్ణారెడ్డి మృత దేహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే కరణం నివాళ లర్పించారు. చీరాల ఆర్డీవో సరోజిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలానే చీరాల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, చీరాల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పలుశాఖల అధికారులు, ఉద్యోగులు పాదిలి వెళ్లి ఆర్డీవో తండ్రికి నివాళులర్పించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్యనారాయణ

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ, ఎస్ఐ ఎస్కే నాయబ్ రసూల్‌లు ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం పావులూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసు వ్యవస్థ గురించి అవగాహన కల్పించారు. ఆడవారిపై జరుగుతున్న నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంకొల్లు పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు, కమిటీ చైర్మన్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెర నుంచి విముక్తి

బల్లికురవ: పదేళ్లుగా ఆక్రమణలో ఉన్న స్థలానికి విముక్తి కల్పించారు అధికారులు. హైకోర్టు ఉత్తర్వులతో శనివారం తహశీల్దార్ కె. రవిబాబు, ఎన్నెస్పీ డీఈ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ ఐ. వేమన సిబ్బందితో ఆక్రమణలు తొలగించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోణిదెన గ్రామ కూడలిలో ఆ గ్రామ మాజీ గ్రామాధికారి కోనిదెన యజ్ఞనారాయణ 1981లో సర్వే నంబర్ 490లో ఎంతో విలువైన 4.5 సెంట్ల స్థలాన్ని వ్యవసాయశాఖ విస్తరణాధికారి కార్యాలయ క్వార్టర్‌కు ఉదారంగా ఇచ్చారు. మూడు దశాబ్దాల పాటు ఇక్కడ నుంచే రైతులకు అధికారులు సలహాలు, సూచనలు ఇచ్చారు. విస్తరణాధికారి పోస్టులు రద్దుతో ఈభవనాన్ని ఎన్నెస్పీ శాఖకు అప్పగించారు. ఈస్థలాన్ని గ్రామానికి చెందిన తన్నీరు రాములు, భర్త సీతారామయ్యలు ఆక్రమించారు. ఎన్నెస్పీ అధికారులు ఈస్థలాన్ని ఖాళీచేయాలని అక్రమణదారుడిని హెచ్చరించినా అతని తీరుమారలేదు. దీంతో ఇరువురు రెండు సంవత్సరాల క్రితం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులతో తహశీల్దార్, ఎన్నెస్పీ డీఈ ఆక్రమణదారైన తన్నీరు రాములుకు కోర్టు ఉత్తర్వులతో ఖాళీచేయాలని నోటీసులిచ్చారు. నోటీసులు ఇచ్చినా ఖాళీ చెయ్యకపోవటంతో పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగించి ఎన్నెస్పీ శాఖకు అప్పగించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న తహశీల్దార్, అధికారులు

నేడు మార్టూరులో వైద్యశిబిరం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 27 వ తేదీ సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్, మార్టూరు రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించనున్న మెగా వైద్యశిబిరంలో గుండె, కిడ్నీ, ఎముకలు, చర్మం, కళ్లు, దంతాలు తదితర సంబంధిత వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని చెప్పారు. రోగులకు భోజన వసతి సమకూర్చనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మార్టూరు: పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండల కేంద్రం మార్టూరులో శనివారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది వివరాల మేరకు.. స్థానిక రామ్ జనార్దన్ కాలనీకి చెందిన పీ వెంకటేష్ తన నివాసంలో పురుగు మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా గమనించిన బంధువులు 108 వాహనం లో స్థానిక ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు వెంకటేష్‌ను చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

85 మందికి వైద్యపరీక్షలు

చీరాల: రోటరీ క్లబ్ క్షీరపురి సహకారంతో కామాక్షి కేర్ హాస్పిటల్ ఆవరణలో శనివారం ఉచిత షుగర్, మోకాళ్ల నొప్పుల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పేద, మధ్యతరగతి వారికి కార్పొరేట్ వైద్యసేవలను అందించడమే లక్ష్యంగా వైద్యసేవలందిస్తున్నట్లు హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు అన్నారు. షుగర్‌తో బాధపడే వారికి తక్కువ ఖర్చుతో వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ మిధున్ కుమార్ చౌదరి, డాక్టర్ చైతన్య చౌదరిలు రోగులను పరీక్షించి వైద్యసేవలందించారు. శిబిరంలో 85 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి అధ్యక్ష, కార్యదర్శులు నన్నపనేని రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, డాక్టర్ విజయకుమార్, రావి వెంకటరమణారావు, హాస్పిటల్ మేనేజర్ తాడివలస సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌గా లుథియమ్మ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న లుథియమ్మ

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు మండలం పావులూరు గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి ఈ నెల 19వ తేదీన నిర్వహించిన సర్పంచ్ ఎన్నికలలో విజయం సాధించడంతో ఆమె శనివారం సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. పావులూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భాను ప్రసాద్ లుథియమ్మతో సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

చినగంజాం: చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం అందించాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన కొత్తపాలెం పంచాయతీ లోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో బాగంగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పౌష్టికాహారం అందజేయాలని, నాణ్యమైన, శుచి అయిన, శుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని చిన్నారులకు వడ్డించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అష్టలక్ష్మిల విగ్రహాల ప్రతిష్ఠ

వేటపాలెం: మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెం రోడ్డులో గల దత్తక్షేత్రంలో పంచదత్తుల మందిరంలో అష్టలక్ష్మిల విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా శనివారం నిర్వహించారు. పంచ దద్దులు పాదుకలను ఏర్పాటు చేశారు. అష్టలక్ష్మి అవతారాలు పాలరాతి విగ్రహాలతో పాటు లక్ష్మీనారాయణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.